# వ్యాస కౌముది




## మనభారతం

డా.వల్లూరుపల్లి శివాజీరావు

16

ఈ భూమండలంలో అద్వితీయమైన, అసమానమైన సంపద, నాగరికత, సంస్కృతి, జ్ఞాన, విజ్ఞాన ప్రతిభలతో వేలాది సంవత్సరాలు(బ్రిటన్ మనదేశాన్ని కబళించడం మొదలు పెట్టిన 1757 వరకూ) తులతూగిన మన భారతదేశపు ఔన్నత్య చరిత్రగురించి నేను వ్రాసిన "ది గ్లోబల్ ఇండియా" అనే పేరుతో ఉన్న పుస్తకం జూలై 2009లో ఇండియాలో ప్రచురించబడింది. ఈ పుస్తకం అందరికీ అందుబాటులో ఉండదని భావించి అందులో పొందుపరిచిన కొన్ని ముఖ్యాంశాలని తెనుగులోకి అనువాదం చేసి 'కౌముది' మాసపత్రిక ద్వారా మీకు అందిస్తున్నాను.

ధారావాహికంగా వచ్చే ఈ ఉపాఖ్యానాలని మీరు చదివి, మీ పిల్లలకుకూడా తెలియచెప్పమని నా విన్నపం. ఈ విధంగా ఘనమైన మన భారతదేశ చరిత్ర భావితరాలకు కూడా చేరుతుందని నా చిన్న ఆశ..!!




## హిందూమతం ఇతరమతాలను ఎలా ప్రభావితం చేసింది?

### సిఖ్ఖు మతం

2.7 కోట్ల జనాభాతో ప్రపంచంలో ఐదవ పెద్ద మతంగా పేరొందిన 'సిఖ్ఖు మతం' (Sikhism) క్రీ.శ. 15వ శతాబ్దం చివరలో భారతదేశంలో ఆవిర్భవించింది. ఇందులో అత్యధిక శాతం పంజాబ్ లో ఉన్నా, సిఖ్ఖులు భారతావనిలో అన్నిచోట్లా స్థిరనివాసమేర్పరచుకున్నారు. ఈమత స్థాపకుడు లాహోర్ దగ్గరలో ఉన్న 'తలవండి'(ఇప్పుడు నాన్కాన సాహిబ్) గ్రామంలో బేడి క్షత్రియ కుటుం బంలో 15 ఏప్రిల్ 1469న పుట్టిన 'నానక్ దేవ్' (1469-1539). అయిన ఈయనకు జన్మత్హ ఈహిందువు 30వ ఏట ఒకరోజు తెల్లవారు ఝామున కాలకృత్యాలు తీర్చుకోటానికి సుల్తాన్పూర్లోని కాలువ దగ్గరకువెళ్ళి మూడు రోజులపాటు ఇంటికి తిరిగిరాలేదు. వచ్చిన తరువాత ఒక రోజంతా మౌనముద్రలోనే ఉన్నాడు. మరుసటిరోజు ఇలా ప్రకటిం

చాడు: "హిందువు లేడు, మహమ్మదీయుడు లేడు; నేను ఎవరి మార్గాన్ని అనుసరించను? దేముడు హిందువు కాదు, మహమ్మదీయుడూ కాదు. అందువల్ల నేను ఇకనుండి దేముడి మార్గాన్నే అనుసరిస్తాను."

తాను మాయమైన మూడురోజులలో తనకుజరిగిన అనుభవాలను తనవారితో చెప్పిన విషయాలు ఇవి: "నేను దేముడి సమ్ముఖానికి తీసుకొనిపోబడ్డాను; అప్పుడు నాకు ఆయన అమృతంతో నిండిన ఒక కప్పు ఇచ్చి నన్ను త్రాగమని ఆదేశించి ఇలాఅన్నాడు: 'ఈ కప్పు ఆరాధనాభావంతో ఉన్న దేముడి పేరుతో నిండి ఉంది. దీనిని నీవు త్రాగు; నేను నీతో ఉన్నాను; నిన్ను ఆశీర్వదించి పైకి లేపుతాను; నిన్ను ఎవరయితే జ్ఞాపకం పెట్టుకుంటారో వారు నాకృపను అనుభవిస్తారు; వెళ్ళు, నాపేరుతో సంతోషపడుతూ ఇతరులను కూడా అట్లాగే చేయమని బోధించు; నేను నీకు నాపేరుని ప్రసాదించాను; ఇది నాపిలుపు అనుకో'." నానక్‌ను దేముడు తనసందేశాలను మానవులకు తెలియజేసే దూతగా ఎన్నుకొన్నందువల్ల ఆయనకు 'గురు' అనే బిరుదు వచ్చింది. ఆరోజునుండి నానక్ తన అనుచరులకు 'గురు' వయ్యాడు. అదే సిఖ్ఖు మతానికి అంకురార్పణ. 'సిఖ్ఖు' (శిక్కు) పదానికి మూలం సంస్కృత 'శిక్ష' (బోధన).

అప్పటినుంచి 'గురు నానక్' 40 ఏళ్ళు తనమత వ్యాప్తికి చాలా పాటుపడ్డాడు. ఆయన మొదట బెంగాల్, అస్సాంలో పర్యటించి తనమత సిద్ధాంతాలను అచ్చటి ప్రజలకు బోధించాడు. తరువాత దక్షిణాదిలోని ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరాపథంలోని కాశ్మీర్, లడఖ్, టిబెట్, అరేబియన్ ద్వీపకల్పంలోని మక్కా, మదీనా, ఆవల ఉన్న బాగ్దాద్‌లలో కూడా పర్యటించి 'దేముడు సర్వాంతర్యామి' అని ఉపదేశించాడు. తాను 22 సెప్టెంబర్ 1539న 'రావి' నదీ తేరాన ఉన్న 'కర్తార్‌పూర్' (పాకిస్తాన్‌లో భారత సరిహద్దునుండి 3 కి.మీ. దూరంలో ఉంది)లో 70వ ఏట మరణించే ముందు తనతో చాలాకాలం విశ్వసనీయతతో భక్తుడుగా ఉన్న '**బాబా లెహ్నా**' పేరుని 'గురు **అంగద్ దేవ్**'గా మార్చి తనమతానికి వారసునిగా నియమించాడు. ఈయనే సిఖ్ఖుల రెండవ గురువు.

నానక్ మరణశయ్యమీద ఉన్నప్పుడు హిందు, మహమ్మదీయుల అనుచరులలో ఆయన అంత్యక్రియలు ఎలా జరపాలనే విషయం మీద తర్జన బర్జన పడ్డారు. అప్పుడు నానక్ కల్పించుకుని తనశరీరం ప్రక్కన రెండు వర్గాలు పూలదండలు పెట్టి మూడు రోజుల తరువాత ఎవరి దండ వాడకుండా ఉంటుందో వారు తమ ఆచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వర్తించుకోమని సలహా ఇచ్చాడు. కాని చనిపోయిన తరువాత మరుసటి రోజు ఉదయం వాళ్ళువచ్చి చూస్తే నానక్ శరీరం కనపడలేదు. కాని రెండు వర్గాల దండలుమాత్రం అలాగే ఉన్నాయి. అప్పుడు హిందువులు తమ దండను 'దహనం' చేస్తే, మహమ్మదీయులు 'పూడ్చి' పెట్టారు.

## సిఖ్ఖుమత సిద్ధాంతాలు, సూత్రాలు ఏవి?

నానక్ హిందూమతంలోని విగ్రహారాధన, జాతి-వర్ణ వ్యవస్థ, కర్మకాండ, తపస్సు, సన్యాసిత్వాన్ని వ్యతిరేకించినా, హిందూమత ఊటనుండి ఆవిర్భవించిన చాలా సిద్ధాంతాలను అనుకరించాడు. మచ్చుకకు కొన్ని పరిశీలించండి.

1. ఈవిశ్వంలో అందరికీ ఒకే దేముడున్నాడు. ఈ సర్వాంతర్యామియే సృష్టికర్త, పరిరక్షకుడు, వినాశకుడు. పేరులేని, రూపం లేని, వర్ణణాతీతమైన, వినాశరహితుడైన ఈయన అన్నిమతాలలోనూ ఉంటాడు. అర్థంకాని ఈవ్యక్తి అన్ని మతాలలోనూ ఒక్కడే
2. మానవజన్మ ఇతర ప్రాణుల జన్మలకంటే ఉత్తమమైనది. అందువల్ల దేవునిలో ఐక్యమవ్వటానికి మానవజన్మద్వారానే సాధ్యమవుతుంది.

3. ఒకవ్యక్తి మరణించిన తరువాత ఆత్మ వేరొక ప్రాణిలో ప్రవేశిస్తుంది; ఆప్రాణి మానవుడుది అయినా కావచ్చు, జంతువుది అయినా కావచ్చు.
4. ఇప్పటి జన్మ గత జన్మలలో చేసినకర్మలమీద ఆధారపడి ఉంటుంది. దేముడిని కనుగొన్నప్పుడే ఈజనన-మరణ చక్రంనుండి విముక్తి కలుగుతుంది.
5. మోక్షం అంటే తుది తీర్పు తరువాత స్వర్గానికి వెళ్ళటం కాదు, దేముడిలో ఐక్యమవ్వటమే.
6. సత్ప్రవర్తన, నైతిక జీవిత నియమావళిని ఆచరిస్తూ, అత్యంత నిష్ఠ, ధ్యానంతో దేవునిపేరుని స్మరిస్తూ జపం చేసనప్పుడే మానవుడు దైవంలో ఐక్యమవటానికి సులభమవుతుంది.
7. గర్వం, కోపం, అత్యాశ, మోహం, కాముకత్వం అనే ఐదు మానవునికి హానికరమైన విషయాలు, మానవునిలో ఉండకూడని దుష్ట ప్రవృత్తులు. దుర్బలమైన మనస్సుతో వీటికి బానిసలైనవారు దేముడిదరికి చేరలేరు. దేముడి దరి చేరాలంటే వీటిని వీడనాడి గాఢమైన, అమితశ్రద్ధతో, భక్తిధ్యానంలో ఆయనను సేవించుకోవాలి.
8. మానవుడు తన మనస్సును జయిస్తే, ప్రపంచాన్నే జయించవచ్చు. ప్రతి మానవునిలోనూ దేవుని దీపముంటుంది, కాని తనలోఉన్న గర్వం, అహం అణచివేసినప్పుడే దాని కాంతి కనపడుతుంది.
9. మానవులందరు సమానులే, తారతమ్యాలేమీలేవు. మతసంబంధిత సేవలు, ఉత్సవాలలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులున్నాయి. అనిమతాలవారూ సిఖ్ఖు గురుద్వారాలో ప్రవేశార్హులు.

## సిఖ్ఖుమత గురువులు ఎందరు, వారుఎవరు?

నానక్‌తో కలిపి సిఖ్ఖుమత గురువులు 10మంది. ప్రతిగురువు మరణించే ముందు తన వారసుడ్ని నియమిచాడు. ఈయన తప్పమిగతా గురువులందరు తమకుటుంబంలోని వారినే వారసులుగా నియమిచారు. నానక్ తరువాత వచ్చిన గురువులు వీరు:

**రెండవ గురువు అంగద్ దేవ్** (7 సెప్టెంబర్ 1539 to 29 మార్చి 1552): ఈయన పంజాబ్‌లో 'గుర్ముఖి' లిపి ప్రాచుర్యానికి కృషిచేస్తూ దేశమంతటా పర్యటించి తనమతాన్ని వ్యాప్తిచేయటానికి వీలుగా అనేక చోట్ల సిఖ్ఖు కేంద్రాలను, సంఘాలను ఏర్పాటుచేశాడు. మొఘల్ వంశం వారసుడు'హుమాయూన్' రాజ్యం పోగుట్టుకున్నప్పుడు అంగద్ దేవ్ ఆశీస్సులు పొందాడు.

**మూడవ గురువు అమర్ దాస్** (26 మార్చి 1552 to 1 సెప్టెంబర్ 1574): ఈయన సతి, పర్దా వ్యవస్థలను నిషేధించటంతోపాటు దేశంలో వేర్వేరు చోట్ల 22 సిఖ్ఖు కార్యాలయాలను ఏర్పాటుచేసి వాటి నిర్వహణకు స్థానిక మతబోధకులను నియమించాడు.

**నాలుగవ గురువు రాం దాస్** (1 సెప్టెంబర్ 1574 to 1 సెప్టెంబర్ 1581): ఈఅమర్ దాస్ అల్లుడు రాందాస్ వివాహ మంత్రాలను రచించటంతోపాటు'హర్మిందర్ సాహిబ్' (గోల్డెన్ టెంపుల్; Golden Temple)కు రూప కల్పన చేశాడు. సిఖ్ఖుమత సిద్ధాంతాలు నచ్చినందువల్ల అక్బర్ ఇచ్చిన జాగీర్‌లో ఈయన'రాం దాస్ పూర్'అనే పట్టాణానికి పునాది వేశాడు. ఇదే కాలక్రమేణా 'అమృత్‌సర్' అయింది.

**అయిదవ గురువు అర్జున్ దేవ్** (1 సెప్టెంబర్ 1581 to 30 మే 1606): రాందాస్ పుత్రుడైన అర్జున్‌దేవ్ పర్యవేక్షణలో అమృత్‌సర్ పట్టణ నిర్మాణం పూర్తిఅయింది. తారన్ తారన్, కర్తార్‌పూర్ పట్టణాల ఏర్పాటుకు పునాది కూడా వేశాడు. ఆయన 1604లో సిఖ్ఖుల పవిత్ర గ్రంథం 'ఆది గ్రంథ్' మొదటి సంపుటం పూర్తిచేసి, మొదటి నలుగురు గురువుల ఉపదేశాలను సేకరించి వాటిని పద్యరూపంలో

తీసుకువచ్చాడు. అంతేగాక సిఖ్ఖుల ఆలయం 'గురుద్వార సాహిబ్ 'నిర్మాణానికి ప్రతి సిఖ్ఖు ఆదాయంలో పదవ వంతు (దశవద్) వసూలుచేశాడు. మహమ్మదీయ మతంలోకి మారటం తిరస్కరించినందుకు ఈయనను మొఘల్ నవాబ్ జహంగీర్ క్రూరంగా చంపించాడు.

**ఆరవ గురువు హర గోబింద్** (25 మే 1606 to 28 ఫిబ్రవరి 1644): తండ్రి అర్జున్ దేవ్ హత్య చేయబడటానికి కొద్ది రోజుల ముందు గురువుగా నియమించబడిన 11ఏళ్ళ హర గోబింద్ తన పదవీ కాలంలో మొఘల్ నవాబుల బారినుండి తప్పించుకోటానికి బలమైన సిఖ్ఖు సైన్యాన్ని తయారుచేశాడు. షాజహాన్ పాలనలో పంజాబ్‌లోని మహమ్మదీయ నాయకులను ఎదిరించి గెలుపు సాధించాడు. ఈయన సిఖ్ఖు మత సంబంధిత అధికారిక విధాననిర్ణయాలు తీసుకోటానికి 'అకాలీతక్త్' (Akal Takth;Timeless Seat),; గురువుని చేరటానికి 'గురు ద్వారా '(Gateway) లను ఏర్పరచాడు.

**ఏడవ గురువు హర రాయ్** (3 మార్చి 1644 to 6 అక్టోబర్ 1661): 5 ఏళ్ళ వయస్సులో గురువయిన ఈహరగోబింద్ మనుమడు తన హయాంలో సిఖ్ఖుసైన్యాన్ని మరింత బలోపేతం చేశాడు. మొఘల్ సింహాసనం పోటీలో షాజహాన్ పెద్దకొడుకు 'షికో దారా' ఔరంగ్‌జేబ్ నుండి పారిపోయినప్పుడు హర రాయ్ ఆశ్రయమిచ్చాడు. ఈయన చనిపోయే ముందు 5 ఏళ్ళు వయస్సుఉన్న హరకిషన్‌ను తన తరువాతి గురువుగా నియమించాడు.

**ఎనిమిదవ గురువు హరికిషన్** (6 అక్టోబర్ 1661 to 30 మార్చి 1664): ఈబాలగురువు 1664మార్చి నెలలో డిల్లీ వెళ్ళినప్పుడు మశూచి బారినపడి 8 ఏళ్ళ వయస్సులోనే మరణించాడు.

**తొమ్మిదవ గురువు తేగ్ బహదూర్** (20 మార్చి 1665 to 11 నవంబర్ 1675): ఆరవ గురువు హరగోబింద్ చివరి కుమారుడు , తేగ్ బహదూర్‌ను ఔరంగజేబ్ మహమ్మదీయ మతంలోకి మారమని బలవంతంచేసి కారాగారంలో పెట్టిహింసించినా మారనందుకు ఢిల్లీలోని చాందినీచౌక్ వద్ద శిరచ్ఛేదన చేయించాడు. ఈయన తనకాలంలో ఆనందపూర్ పట్టణాన్ని నిర్మించటమేగాక,'గురు గ్రంధ సాహిబ్'లో కొన్ని శ్లోకాలు కూడా కూర్చాడు.

**పదవగురువు గోబింద్ రాయ్/సింగ్** (11 నవంబర్ 1675 to 7 అక్టోబర్ 1708): 9 ఏళ్ళవయస్సులో గురువు అయిన ఈ తేగ్ బహదూర్ పుత్రుడు 30మార్చి 1699న 'ఖాల్సా' (స్వచ్ఛతగల సైన్యం) అనే వ్యవస్థను ఏర్పాటుచేశాడు. దీని ఉద్దేశం మొఘలుల శక్తిని దీటుగా ఎదుర్కోటానికి స్వచ్ఛమైన, పిటిష్టతగల సిఖ్ఖు సైన్యాన్నితయారు చేయటం. దీనితోపాట ఇంకా కొన్ని కొత్తనియమాలను ప్రవేశపెట్టాడు. ఇవి: సిఖ్ఖు పురుషుల పేర్ల చివర 'సింగ్', స్త్రీల పేర్ల చివర 'కౌర్' బిరుదులు పెట్టుకోవటం; సిఖ్ఖులలో కులరాహిత్యం; స్త్రీలకు పురుషులతో సమానత్వం; ధర్మంకోసం త్యాగానికి సిద్ధమవ్వటం; స్త్రీలలో మేలిముసుగు, సతి, పొగత్రాగటం నిషేధించటం. ఒకరి నొకరు "Waheguruji ka Khalsa, Waheguruji ki fateh (The Khalsa belongs to God; victory belongs to God) అంటూ పలకరించుకోవాలి."

ఖాల్సాలో చేరే ప్రతి సిఖ్ఖు పురుషుడు ఈఅయిదు 'కాకారాలు' (K గుర్తులు) ఆచరిస్తానని ప్రతిజ్ఞచేయాలి: 1. 'కేశ్'- ముండనం కాబడని కేశాలతో మునిలాగా పవిత్రతతో ఉండటం; 2. 'కాంగా'- కేశాలు చిక్కుబడకుండా పరిశుద్ధంగా ఉంచుకోటానికి 'దువ్వెన'; 3. 'కర' - దేముడు ఒక్కడే నని తెలియజేయటానికి, తప్పుచేయకుండా చేతికి సంకెల అన్నట్లుగా కుడిముంజేతికి ఒక ఇనుప లేక స్టెయిన్-లెస్ స్టీల్ 'కంకణం'; 4. 'కాచ్చా' - నడుం క్రిందిభాగాన్ని దాచుకోటానికి లోపల వేసుకునే పొడు గాటి 'అండర్-

వేర్‘; 5. ‘కిర్పణ్‘ ఆత్మరక్షణకు, నిస్సహాయతలోఉన్న ఇతరులను రక్షించటానికి ఒక చిన్న ‘బాకు‘. వీటితోపాటు ఖాల్సా సైనికులకు తమ నైతిక స్థితి, మతవిశ్వాసానికి గుర్తుగా శిరస్సు ‘**దుమల**‘ (తలపాగా) పెట్టుకోవాలనే నియమాన్ని కూడా ప్రవేశపెట్టాడు. ఇది కత్తిరించబడని కేశాలను కప్పటానికేగాక, యుద్ధంలో శత్రుసైనికులు తమను గుర్తుపట్టకుండా ఉండటానికి, ఆపదను ధైర్యంగా ఎదుర్కోటానికి ఉపయోగ పడుతుంది. కాని కాలక్రమేణా ఖాల్సాకు సంబంధించని పురుషులు కూడా దుమలను ధరించటం ప్రారంభించారు.

గోబింద్ సింగ్ ఆదిగ్రంద్‌కు తుది రూపుఇచ్చి, ప్రార్ధనా గీతాలతో నిండిఉన్న‘దశమగ్రంథ్‘ ను పూర్తిచేశాడు. తన నలుగురు పుత్రులు చనిపోయినందువల్ల తాను నాందేడ్ పట్టణంలో మరణించే ముందు ఈయన ‘**గురు గ్రంథ సాహెబ్**‘ కూడా అనబడే ఆది గ్రంథ్‌ను తన వారసునిగానూ, సిఖ్ఖుల చివరి గురువు గానూ ప్రకటించాడు. దీనితో మానవ గురు పరంపర అంతమయింది. అప్పటి నుండి సిఖ్ఖులు అమృత్ సర్ లోఉన్న గోల్డన్ టెంపుల్ లోని ‘గురుద్వారా‘లో ఉంచబడిన ఆది గ్రంథ్‌ను పూజించటం ప్రారంభించారు. గీతాగానం, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన సిఖ్ఖుల పూజలోని ముఖ్యభాగాలు. సిఖ్ఖుమతంలో **పౌరోహిత్య** సాంప్రదాయంలేదు.

------------------

## ఇతర మతాల మీద సనాతనధర్మం ప్రభావం అధ్యాయానికి ముగింపు పలుకు

2010 జూన్ నెల నుండి ఇప్పటి వరకు దేశీయ, విదేశీయ మతాలమీద సనాతనధర్మం ప్రభావం పరిశీలించాము. మానవచరిత్రలో అతి ప్రాచీనమతాలు నిజానికి రెండే ఉన్నాయి. అవి పుట్టుక ఎప్పుడో తెలియని **సనాతనధర్మం,** దీనితరువాత కొంత ఆలస్యంగా ఉద్భవించిన **జైనధర్మం.** హిందూమతంలో మరుగునబడిఉన్న కొన్నిసూత్రాలకు జైనమతం పునర్జీవంపోసి బయటకు తీసుకువచ్చింది. వీటిల్లో ముఖ్య మైనది ‘అహింస‘. **బౌద్ధమతం** తరువాత 2వేల ఏళ్ళకు అవతరించిన **సిఖ్ఖుమతంలో** సనాతనధర్మ పాదఛాయలు జీన, బుద్ధ ధర్మాలకంటే కూడా అధికంగా అడుగడుగునా కనిపిస్తాయి.

సనాతనధర్మం ప్రభావం కేవలం దేశీయమతాలకే పరిమితమవలేదు. విదేశాలలో అంకురించిన మతాల మీదకూడా పడి ఆ మత స్తుల జీవితాలలో అంతర్లీనమై ఉందనేది వారు కాదన్నా వారి గ్రంధాలలోనే నిక్షిప్తమైన, నిర్వివాదమైన నగ్న సత్యం. దీనికి ముఖ్యకారణం ప్రాచీన కాలంలో భారతీయులు మధ్య, పశ్చిమ ఆసియా ప్రాంతాలకు వలస వెళ్ళటం. ఋగ్వేదకాలపు రెండవదశ (క్రీ.పూ. 5000-4000 మధ్య) లో **జరాతుష్ట్ర** నుండి క్రీ.పూ. 2100-1900 మధ్య సరస్వతీ-సింధు నదుల ప్రాంతంలో వచ్చిన ‘**బ్రహ్మాండమైన వరద**‘ కార ణంగా ‘**ఆవలి తీరాన**‘ నివసించే భారతీయుడైన **అబ్రహం** వరకు ఈవలసలు జరిగాయి. హిందువులైన వీరే **పారశీక, యూదు** మతాలకు ఆది పురుషులు. యూదుమతం నుండి అంకురించిందే ‘**క్రైస్తవ మతం**‘. క్రీ.పూ. ఒకటవ శతాబ్దంలో భారతావని రాజైన ‘**విక్రమాదిత్య**‘ కాలంలోనూ, అంతకు ముందు కూడా భారత్ పాలనలో ఆధ్యాత్మికతో శోభిల్లిన అరేబియా ద్వీకల్పం (Peninsula)లో నివసించే హిందూ కుటుంబంలో జన్మించిన వ్యక్తే **మహమ్మదీయ** మత స్థాపకుడు.

ఈకారణంగా సనాతనధర్మం **వేరు** నుండి ఉద్భవించిన ఈవేర్వేరు మతాలలో సనాతనధర్మం పద ఛాయలు కనపడటంలో ఆశ్చర్య మేమీలేదు.

## ఈ సనాతనధర్మం పద ఛాయలు ఏమిటి?

- అనేక దైవరూపాలు, దైవాంశ సంభూతులను ఆరాధించే సనాతన ధర్మస్తులు దేవుడు ఒక్కడే అని నమ్ముతారు. ఈ నమ్మకానికి విష్ణువు మాటలే ఆధారం: "అజ్ఞానులే నేను, శివ భిన్న వ్యక్తులని భావిస్తారు; అతను, నేను, బ్రహ్మ ఒక్కటే. ఈవిశ్వం సృష్టి, పరిరక్షణ, వినాశనానికి మేము వేర్వేరు పేర్లతో చెలామణి అవుతాము. మేము త్రిమూర్తులుగా సర్వ ప్రాణులలో వ్యాపించి, పరివృతమై ఉంటాము. అందువల్ల జ్ఞానులు ఇతరులందరిని తామే అనిభావిస్తారు." దేవుడు లేడనే బౌద్ధ, జైనమతాలు తప్ప మిగతావన్నీ దేవుడున్నాడు, అదీ ఒక్కడే అని నమ్ముతాయి.
- జనన-మరణ చక్రం నుండి విడుదల అయి దేవునిలో ఐక్యమయ్యే విషయంలో సనాతనధర్మంతో అన్నిమతాలూ ఏకీభవిస్తాయి. కాని ఈప్రక్రియను సనాతన, జైన ధర్మాలు 'మోక్షం' అంటే, బౌద్ధమతం 'నిర్వాణ' అని, మిగతా మతాలు 'విముక్తి', 'విమోచన' (Salvation) అని అంటాయి.
- ఆత్మ (Self) విషయంలో ఒక్క బౌద్ధమతం మినహా మిగతా అన్నిమతాలూ సనాతనధర్మంతో ఏకీభవిస్తాయి.
- మానవ మనుగడకు అవసరమైన ధర్మం, సత్యం, సత్ప్రవర్తన, సశ్చీలత గురించి వెలిబుచ్చిన సనాతనధర్మం అభిప్రాయాలతో దాదాపు అన్నిమతాలలోనూ సారూప్యతలు కనబడతాయి.

**ఇన్ని సారూప్యతలున్నందువల్ల 18వ శతాబ్దంలో 'నవ్య-హిందూమతం' (Neo-Hinduism) స్థాపకులు "అన్నిమతాలు ఒక్కటే, కాని వాటి దారులు వేరు" అనే క్రొత్త సిద్ధాంతాన్ని లేవనెత్తారు. నిజానికి ఈరోజుకుకూడా ఏమతం వేరొక మత సిద్ధాంతాలతో ఏకీభవించదు.**

## ఈ 'నవ్య-హిందూమతా' నికి మూలం ఏమిటి?

ఆంగ్లేయుల పాలనలో సువార్త క్రైస్తవుల (Christian Evangelists) ప్రభావంవల్ల రాజా రామమోహన్ రాయ్ (1772-1833) లాంటి బెంగాలీ మత సంస్కర్తలు సనాతనధర్మంలో క్రైస్తవ సిద్ధాంతాలు జొప్పించి 'నవ్య హిదూమతం' స్థాపించారు. ఈదివిటీని ఆతరువాత దేబేంద్రనాద్ టాగోర్ (1817-1905), ఈశ్వర చంద్ర విద్యాసాగర్ (1820-91), కేశబ్ చంద్ర సేన్ (1833-84) లాంటివారు పట్టుకుని కొంచెం ముందుకు తీసుకువెళ్ళారు. సేన్ బోధనలతో మంత్రముగ్ధుడైన రామకృష్ణ పరమహంస (గదాధర్ చటోపాధ్యాయ, 1836-96) కూడా 1875లో 'నవ్య హిందు' (neo-Hindu) క్రియాశీలుడయ్యాడు. ఆయన అన్నిమతాలను శోధించి ఏమతాన్ని నిష్ఠతో అనుసరిస్తే ఆమతం ఆదిపురుషుడి దర్శనం స్వప్నంలో జరుగుందని తెలుసుకున్నాడు. 'సుఫీ-మహమ్మదీయుడి' జీవితం గడిపినప్పుడు మహమ్మద్ దర్శనం; క్రైస్తవమతాన్ని ఆచరిస్తే 'జీసస్ క్రైస్ట్' దర్శనం, బౌద్ధుడు అయినప్పుడు బుద్ధుడి దర్శనం జరిగిందట. దీనినిబట్టి "అన్నిమతాలు ఒకటే, కాని దారులువేరు" అని సిద్ధాంతీకరించాడు. కాని ఈసిద్ధాంతాన్ని హిందూధర్మశాస్త్రాలేగాక ఇతరమతాలన్నీ వ్యతిరేకించాయి.

ఈసిద్ధాంతానికి మూలాధారం ఋగ్వేదంలోని ఒకశ్లోకం (ఒకటవ మండలం, 164.4): " **ఏకం, సత్, విప్ర, బహుదా, వదంతి."** దీని అర్థం: "సత్యం (దేవుడు) ఒకటే, కాని జ్ఞానులు దీనిని (ఈయనను) వేర్వేరు పేర్లతో సంభోదిస్తారు." దీనికి రామకృష్ణలాంటి నవ్య హిందూ మతస్తులు వక్రభాష్యం ఇచ్చి పైన నుడివిన అసందర్భమైన నవ్య హిందు సిద్ధాంతాన్ని వాడుకలోకి తెచ్చారు. దీనిని సాంప్ర దాయ

హిందువులు తిరస్కరించటానికి కారణం ఈఋగ్వేదశ్లోకం పుట్టినప్పుడు ఇప్పటి మతాలేవీ లేవు. ఇది అప్పటి సనాతనధర్మంలో దేవుడి (సత్యం)కి ఉన్న వివిధ పేర్ల గురించిన అభిప్రాయాలకు దర్పణమేకాని ఆయనను (దానిని) చేరుకోటానికి వెలిబుచ్చిన దారులు కాదు!

రామకృష్ణుడి వక్రభాష్యాన్ని ఆయన ప్రముఖ శిష్యుడు వివేకానంద (నరేంద్రనాథ్ దత్తా, 1863-1902) పశ్చిమదేశాలలో హిందూ మతవ్యాప్తి సులభతరంచేయటానికి ఉపయోగించాడు. తరువాత వచ్చిన ఆధునికవాదులు ఈ 'నవ్య-హిందూత్వం' ఉచ్చులో పడి సాంప్రదాయ హిందుత్వాన్ని పరిత్యజించారు. సానాతనధర్మ రక్షకులైన సాంప్రదాయ హిందువులు ఈరకమైన మార్పులు జీర్ణించుకోలేకపోయారు. అలాగని వీరు స్వచ్ఛతతో కూడిన హిందూధర్మాన్ని ఆధునిక మనస్సులు సులభంగా అర్థంచేసుకోగలరీతిలో తెలియజేయలేకపోతున్నారు. ఈరోజున అనేక మతాలకు తల్లి అయిన సనాతనధర్మం గురించి ప్రపంచంలో అధికులే అర్థంచేసుకోలేకున్నారు.

సనాతనధర్మ పెద్దలుకూడా దీనికి తగినవిధంగా స్పందించటంలేదు. స్పందించిన పెద్దలు ఎదుర్కొంటున్న కొన్ని ప్రతికూలశక్తుల ప్రతిఘటనలవల్లా, కొంతమంది ప్రయత్నించినా సహకారంలేని ప్రభుత్వ విధానాలవల్లా, మహమ్మదీయ, క్రైస్తవమతాల ఆటు పోట్లవల్లా, ఈమతాల తల్లికి తన మాతృభూమిలోనే భవిష్యత్ మనుగడ కష్టతరం అవుతుందా?

ఈ సాంప్రదాయ-ఆధునిక సంఘర్షణ కేవలం హిందూధర్మానికే పరిమితమవలేదు. ఇతర పెద్దమతాలైన క్రైస్తవ, మహమ్మదీయ మతాలలోకూడా ఉంది.

(వచ్చే సంచికలో నావ్యాసం వివిధ శాస్త్ర, వైజ్ఞానిక రంగాలలో ప్రపంచంలో విశాలభారతావని పాత్ర, సాధించిన అభివృద్ధి గురించిన నూతనోధ్యాయం గణితశాస్త్రంతో మొదలవుతుంది. వేచి చూడండి. )

మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com




Click here to share your comments on this essay